లోకంకోసం గొప్పలకి పోతే

# చివరికి మిగిలేది—

మధిర భానుమూర్తి

సావిత్రి వివాహం చాలా వైభవోపేతంగా జరిగింది. పెండ్లికి తరలివచ్చిన మగపెళ్లివారు అంత తృప్తిగా ఏవిధమైన పేచీలూ లేకుండా వెళ్ళడం ఇదివరకు ఎక్కడా చూడలేదన్నారు వందలాది పెళ్ళిళ్లు చేయించిన వయోవృద్ధులు కూడా. పెళ్ళి చూడటానికి వచ్చినవాళ్లు కూడా తృప్తాస్మ అని భోజనం చెయ్యనిదే అక్కడనుంచి వెళ్ళలేదు. పుట్టినింటివారూ మెట్టినింటివారూ ధనవంతులే కావడం నిజంగా ఆమె అదృష్టం.

ఆమె వివాహం అయ్యే వరకూ ఇంటిదగ్గర ఏమాత్రం పని చెయ్యలేదు. చెయ్యవలసిన అవసరం కూడా లేకపోయింది. ఇరుగుపొరుగు వాళ్ళపిల్లలు అనుకునేవారుకూడా "సావిత్రికేమమ్మా? మహా రాజుబిడ్డ. దానికీ ఒకరికీ సాటా? దానికి జరిగినట్టు మనకెక్కడ జరుగుతుంది? ఆవిడకంటే నౌకర్లు, చాకర్లు, మనస్సులో అనుకోవటం తరవాయిగా ఏం కావలసినా తెచ్చిపెట్టే తండ్రి, ముద్దూ మురిపెంతీర్చే అన్నలూ అంతా ఉన్నారు. దానితో మనకి వంతేమిటి? ప్రొద్దుటలేచి పని ప్రారంభిస్తే సాయంత్రంవరకూ వంచిన నడుం ఎత్తేందుకు లేదు మనకి. ఒక్కగంట వచ్చి కూచుందుకు గగనమై పోతోంది. అన్నిపనులూ మనం చేసుకోకపోతే ఎవరుచేస్తారు మనకి?" అని. "దాని అదృష్టం బాగుండి అత్తవారుకూడా అలాంటివారే దొరికితే ఇక చెప్పాలా? వాళ్ళ నాన్న అలాంటి సంబంధం కోసమే విశ్వ ప్రయత్నం చేస్తున్నాట్ట" అంది ఇంకో కామె. అయితే ఏన్నైవరికీ సావిత్రి అంటే అసూయ లేకపోవటానికి కారణం సావిత్రిలో ఉన్న మంచి మంచిగుణాలే. అంత స్థితిమంతుల బిడ్డనని గర్వం లేదు. అందరితోనూ కలిసి మెలిసి తిరుగుతుంది. నలుగురి ఇళ్ళకూ వస్తూ పోతూ ఉంటుంది. చిన్న చిన్న పనులలో అందరికీ సహాయం చేస్తుంది కూడా. వాళ్ళ యింట్లో అవసరంలేక చెయ్యదు గాని ఆమెకు పనులు చేతగాక, మొండెత్తు వెయ్యటంవల్లమాత్రం కాదు.

నలుగురూ అనుకున్నట్టుగానే సావిత్రికి తగిన సంబంధమే దొరికింది. అత్తవారు స్థితిమంతులు. అచ్చట్లు ముచ్చట్లు బాగా తెలిసినవారు. అత్తవారింట్లో అందరికీ సావిత్రంటే చాలా అభిమానంగా ఉంది. సావిత్రి మామగారు కొంచెం వయస్సుమీరినవాడే అయినా ఆర్జన ఉడగలేదు. సావిత్రి భర్తకూడా రెండుచేతులా ఆర్జిస్తున్నాడు. ఆమె స్థితికి ఏవిధంగానూ లోటులేక సరిగదా ఇంకా ఎక్కువగానే ఉందనాలి. ఆమెకు ఇక్కడ యజమానురాలి హోదా వచ్చింది. అత్తగారు కూడా తనే ఆధిపత్యంవహించాలని అడుగడుక్కీ పోట్లాడే రకంకాదు. అందరూ అనుకూలంగానే ఉన్నారు. పుట్టింటికి అత్తవారింటికి అంతభేదం కనిపించలేదు సావిత్రికి.

నిత్యం వారి ఇంటికి వచ్చేపోయేవారు ఎక్కువ. బంధువులనో మిత్రులనో ఎప్పుడూ సావిత్రి మామగారికి అతిథే. ఏ ఒక్కరోజునా ఆయన ఒక్కడూ భోజనంచేసి ఎరుగడు. ఆ ఊరికి ఏ పనిమీద ఎవరువచ్చినా వారి యింటికి రావలసిందే; అక్కడ భోజనంచెయ్యవలసిందే! అది ఆ ఇంటి యజమాని స్వభావం. అందుచేత కాలక్రమేణా వారి సంపదలు సన్నగిల్లాయి. నిత్యం త్రవ్వుతుంటే ఎంతకొండైతేమాత్రం అగుతుందా తరగకుండా?

సావిత్రి కాపరానికొచ్చినప్పుడు పంచిపెట్టిన మిఠాయిలు ఇంకా మరచిపోని ఆ ఊరివారు ఇంకా సావిత్రినుండి అలాంటివే ఆశిస్తూండటంలో తప్పేమీలేదు. సావిత్రికి తొలిసారి తెచ్చిన సూడిదలు ఎంత ఖరీదైనవి! ఇవన్నీ వాళ్ళకి ఒకళ్ళు చెప్పాలా?... కాని స్థితిలోవచ్చిన మారుపువల్ల

సావిత్రిలోకూడా వెనుకటి పోలికలు కనిపించటం లేదు. వెనుకటంత ఖరీదైనవి ఇప్పుడు పంచిపెట్టలేదు. పెద్దకుర్రాడి పుట్టినరోజు ఎంత వైభవంగా చేసింది రెండుమూడేళ్లు! ఇవాళ నాలుగోవాడి కొచ్చేసరికి కావలసినవాళ్ళ నలుగురికీ పెట్టటమే గగనమయిపోతోంది. అందుచేతే నలుగురిలో ముఖం చెల్లటంలేదు. ఒకనాడు తన యింట్లో ఏ చిన్న విషయానికైనా నలుగురినీ భోజనాలకు పిలిచి కులాసాగా కాలంగడిపిన సావిత్రి ఇవాళ ఎవరినీ పిలవకుండా చేసుకోవలసి వస్తోంది. పొరుగింటివాళ్ళనికూడా పిలవలేకపోయింది. బాధపడి ఏంలాభం? పోనీ అని పిలిస్తే పెట్టుకునే శక్తి లేదుగా ఇప్పుడు? అలాగని పిలవకపోతే నలుగురూ ఏమనుకుంటారు? "సావిత్రమ్మ భోజనానికేనా పిలిచింది కాదమ్మా! అత్తగారి రోజుల్లోనే బాగుండేది!" అనుకోరూ? తననిగురించి అంత కటువుగా వాళ్ళు అనుకోవటం ఆమెకు ఏమంత ఇష్టంగా లేదు. వాళ్ళుమాత్రం ఎందుకలా అనుకోవటం? శక్తిఉంటే పిలుస్తారు లేకపోతే లేదు. శక్తి లేకపోయినా పిలవాలని ఈ నిర్బంధమేమిటి? ఇదేమంత నచ్చలేదు సావిత్రికి. కాని అంతలో తనే సమాధానపరుచుకుంటుంది. "ఇదివరకల్లా పిలిచేవాళ్ళం కనక అనుకుంటారు. లేకపోతే ఎందుకనుకుంటారు? అదీకాక, లేక పిలవలేదంటే పరువు తక్కువకాదూ?"

ఇంట్లో తన పిల్లలకి చేతిమీదకి నెయ్యిలేని రోజు వచ్చినా, ప్రతి చిన్న విషయానికీ ఊరువారి నందరినీ ఆరగింపుకి ఆహ్వానించాలి. తప్పుతుందా మరి? ఇదే ఇప్పుడు మిగిలినది. ఇది ఒక్క సావిత్రి విషయంలోనే కాదు. చాలామంది విషయంలో ఇంతే!

ఊరి అమ్మలక్కలకి ఇవేళ పేరంటం ఏముంది? ఎవరింట్లో భోజనం ఉంది? ఏపాటి చూడిద పంచి పెడతారూ?—అనే ఆలోచనే ప్రొద్దస్తమానం. వీళ్ళకి ఇతరుల కష్టసుఖాలతో పనిలేదు. వాళ్ళ యింట్లో తిండి తింటున్నారా లేదా అన్న ప్రశ్న రాదు వీరి కెప్పుడూ. శక్తిఉన్నా, లేకపోయినా పెద్దపెద్ద మిఠాయిలు పంచిపెడితే వారి మెప్పు లభిస్తుంది. ఉండ సైజు ఏమాత్రం తగ్గినా వారి ఆగ్రహానికి గురి కావలసి వస్తుంది. ఏమాత్రం ఆలోచనాలేకుండా మూర్ఖంగా సంసారాలను ఒక ఒడ్డుకు తీసుకువచ్చే ఆచారాలను వదిలినంత మాత్రాన వచ్చే ప్రమాదాలేమీలేవు నిజానికి. పైగా చాలా మధ్యతరగతి కుటుంబాల ఆర్థికస్థితి బాగుపడుతుంది. వాళ్ళుకూడా నాలుగురోజుల పాటు తిండితిని, బట్టాకట్టా గలుగుతారు. ఈమాత్రం ఆలోచనచేస్తే బాగుండును. కాని చెయ్యరుగా!

ఒక ఉద్యోగస్థుడు జీతం రాళ్ళ తన పెద్ద సంసారానికి చాలీచాలక బాధపడుతూ, ఏదో గుట్టుగా కాలక్షేపం చేస్తుండగా ఆయనకు తీవ్రంగా జబ్బుచేసి జీతం నష్టంమీద సెలవుపెట్టి చికిత్సచేయించుకుంటున్నాడు. ఇలా ఉండగా ఆయనకుమార్తె గర్భవతి అయింది. ఆమెను తీసుకువచ్చి పురుడుపోసి పంపటమే తన శక్తికి మించిన పనిగా ఉంది ఆయనకు. అలాంటప్పుడు ఇంక ఆయన అచ్చట్లు ముచ్చట్లు ఏం తీర్చగలడు? కాని తప్పదంది యజమానురాలు. తొలిచూలు. చూడిద తప్పదుగదా! తీసుకువచ్చాక గాజులు వేయించడమనీ, పువ్వులు ముడిపించడమనీ, ఇదనీ, అదనీ ఏవో చిల్లర అనేకం ఉంటాయి. ఇవన్నీ ఆ యిల్లాలుకి చిన్నవిగానే కనిపిస్తున్నాయిగాని ఆయనకు వందలకొద్దీ రూపాయలులాగ కనిపిస్తున్నాయి. ఆ మాట ఆవిడకి నచ్చచెప్పాడు. కాని ఆవిడ మనస్సు కెక్కలేదు. "అయ్యో! నా మొహానికి ఒక ముద్దూ ముచ్చటాకూడాను. ఎప్పుడూ మనకిలేదే! ఇక ఉన్న దెప్పుడు? ముచ్చట తీరే దెప్పుడు?" అంది కోపంగా. "అదికాదు. కొంచెం నాకు నయమై ఆఫీసుకు వెళ్లటం మొదలుపెడితే, మరో ఖర్చు తగ్గించుకుని భారసాల బాగా చేద్దాం" అన్నాడు ఆయన. దానికి ఆవిడ అంగీకరిస్తేఇంకేంలోటు? "ఎప్పటి అందం అప్పటిదిగాని మరోమాటు రమ్మంటే వస్తుందా? అయినా, అందరూ ఏమనుకుంటారో అనే ఆలోచనేలేదు మనిషికి! మొన్న ప్రక్కింటి శారద అడిగింది, "మీ అమ్మాయిని ఎప్పుడు తీసుకువస్తారు?" అని. వాళ్ళకేంచెప్పను? ఆ మాటకు నేది ఇప్పుడే మానుకోరాదూ? ఈ ఖర్చు ఇప్పుడు చేసుకోవచ్చును." అంది తన యజమానురాలి హోదా అంతా చూపిస్తూ.

సంసారాలు ఇలా ఉన్నంతకాలం బ్రతుకు చాలా భారమైపోతుంది తెచ్చేవాడికి. దమ్మిడీ సంపాదన లేకపోయినా దండిగా సంతర్పణలు చెయ్యాలనీ, ఉద్యోగం ఉంటుందా, ఊడుతుందా అన్నస్థితిలో ఉన్నా ఆడకూతురుని సవారీమీద అత్తింటినుంచి తీసుకురావాలనీ, అవస్థలెక్కువగా ఉన్నా అచ్చట్లూ, ముచ్చట్లూ తీరక తప్పదనీ పట్టుబట్టేవారు (ఆడవారైనా, మగవారైనా) ఆ సంసారానికి చేటే!

ఇవన్నీ లోకంలో తలెత్తుకు తిరగటానికి చేస్తున్నామంటారు, చాలమంది. కాని లోకం కోసం చెయ్యటం నిజమే. అయితే అలా చెయ్యకూడదు. ప్రజలు ఏమనుకుంటారోనని ఎవరూ ఏ పనీ చెయ్యనక్కరలేదు. లోకం దేనికేనా వంకలు పెడుతుంది. కాని కష్టంవస్తే ఆదుకునే వాళ్లు ఒక్కళ్లులేరు ఈ లోకంలో. పెట్టినంత కాలం తింటారు. తరువాత వేళాకోళం చేస్తారు. తిన్న యింటి వాసాలు లెక్కపెడతారు.

బాగా స్థితిమంతుడొకాయన ఉండేవాడు. ఆయన ఉచ్ఛదశలో ఉన్న రోజుల్లో ప్రతిచిన్న విషయానికీ దూరతీరాల్లో ఉన్న బంధువులను మిత్రులను కూడా పిలవనివిందు ఒక్కటీ ఉండేది కాదు. ఆయన కొడుకు ఫస్టుఫారం ప్యాసయితే, వాళ్ళమ్మాయికి మాటలువస్తే ఆయనచేసిన విందులకి ఒక్కొక్కదానికి కనీసం వందలకొద్దీ హాజరయి ఉంటారు. అంత వైభవంగా రోజులు గడిపిన ఆయనకు కూడా అవసానదశలో రోజువెళ్ళటం కష్టమయి పోయింది. ఎప్పుడూ సత్రంలా ఉండే ఆ ఇంటికి వచ్చేవారు ఒక్కరు లేకపోయారు. ఇప్పుడువస్తే ఆయనకు ఆసరా కావలసి వస్తుందని అందరికీ భయమే. చాలాసంవత్సరాలు ఆయన ఉప్పూ, పులుసూ తిన్న ఒకాయనతో ఈ విషయమై ముచ్చటిస్తే "ఆఁ! ఇవాళ ఆయనని లాభం ఏమిటండీ? కానిరోజు లొచ్చి పడ్డాయి. ఎవరు ఎవరికి సహాయం చెయ్యగలరు చెప్పండి? గడ్డు రోజులాయిరి! అయినా, ఉన్నప్పుడు మరీ అంత మన్నూ మిన్నూ తెలియకుండా మసులుకోవటం దేనికి? ఇవాళ నలుగురినీ ఆడిపోసుకుంటే మాత్రం ఎవరేం చేస్తారు? ఈయనగారి పెట్టుపోతలకి ఎవడు ఆశించాడు? ఈయన పెట్టు వల్లే మా జీవితాలు వెళ్ళాయా? ఏదో ఆయన పిచ్చిగాని... వేడుకకి రమ్మంటే వచ్చాముగదా అని తిన్నవాడొక్కడూ చెయ్యలేదంటే మేము ఏంచెయ్యగలం?" అన్నాడు. ప్రపంచంతీరు అది.

కాని ఆయన మాటలు కూడా పూర్తిగా కాదనేందుకు లేదు. అందుకనే అన్నింటినీ "ఇది తప్పదు గదా!" అనుకోవటంకన్న నిజంగా తప్పనిదేదో తప్పేదేదో ముందు జాగ్రత్తగా ఆలోచించి చేస్తే చాల మంచిది—తరువాత "అయ్యో!" అని బాధపడటంకన్న.

# పంతగాడి ప్రాణాలు

దుత్తా దుర్గాప్రసాద్

తలచుకొంటే, 'సిల్లీ'గా వున్నా, ఆజన్మాంతం మరచిపోలేని సంఘటనలు ప్రతిఒక్కడి జీవితంలోనూ (ముఖ్యంగా బాల్యంలో) ఉంటాయ్.

ఓమారు వాటర్ సప్లై (18") పైప్సు రోడ్డు పక్కన పడేసి ఉన్నాయ్. "అందులోంచి దూరగలవా?" అన్నాడు మదన. "తప్పకుండా!" నన్నాను. "అయితే కానియ్, అర్ధణా పందెం" అన్నాడు. ఒళ్ళంతా ముడిచుకొని చల్లగా దూరాను. మధ్యవరకూ సులభంగానే పోయాగాని అక్కడెందుకో మోకాళ్ళు రెండూ బిర్రుగా పట్టేశాయ్! గట్టిగా లాగినా రాలా! ఇక బయటికి రాలేనేమో ననిపించేప్పటికి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. "అమ్మో"అని పెద్దగా అరిచా! అరుపుకి గొట్టం పగిలిందో లేక నా కాళ్ళే వెనక్కెళ్ళాయో గాని ఒక్క వూపులో బయట పడ్డా! ఆ నాటినుంచి ఆ గొట్టాల్ని చూచానంటే వళ్ళు జలదరిస్తుంది.

మా వూళ్ళోనే, ఓ శెట్టిగారు మూడంతస్తుల